# బుధడు

గర్భంలో భరించశక్యంగాని, యే బాధతోనో, విరుచుకుపడ్తోంది సముద్రం. కనుచూపు మేరా సముద్రమే, నీలాకాశాన్ని చుంబిస్తూ! ఈ సముద్రమంటే, బుధడికెంతో యిష్టం.

సముద్రాన్ని అనించి, విస్తరించిన మహాపట్నం! తొలినాళ్లలో, యిది మహాపట్నం కాదు, చిన్నచిన్నపల్లెలూ, పాలెంలూ! కంచర్లపాలెం, బోయపాలెం, జాలరిపల్లె, పోతులపల్లె.... యిలా వుండేవిట! ఆదిమ కాలపు పశుపోషణా, ఆహారసేకరణా, ఇనుము వాడకం, వ్యవసాయ వృత్తి మీదుగా, ఆధునిక కాలపు మార్కెట్టూ, రాజ్యమూ, పరిశ్రమలూ, విద్యాలయాలూ, వినోదాలయాలతో, నేటికి పొగలు గక్కే కర్మాగారాలు, కడలిలో కదిలే పెను ఓడలూ, ఇరుకు గల్లీలూ, విశాల భవనాలూ, రణగొణ యంత్ర రొదలూ, నకనకలాడే పేగుల ఆర్తరావాల జనసాగరంతో నిండిన మహానగరంగా రూపెత్తింది! నాడూ, నేడూ సముద్రం మాత్రం మహాసముద్రమే!

"మహా సముద్రం ప్రకృతి, మహానగరం వికృతీ" అంటాడు బుధడు!

ఇసుకలో నడిచి, నడిచీ కాళ్లు లాగుతున్నాయి. అలలకు కాస్త దూరంగా యిసుకలో కూచున్నాను. దీపపు కాళ్ల డబ్బాలో, పల్లీలువాళ్లూ, గుర్రాన్ని పరుగు తీయిస్తూ కిరాయికి స్వారీ చేయమని పిలిచే గుర్రపు యాజమానీ, రకరకాల రంగుల బూరలమ్మేవాళ్లూ – గోలగోల! ఎవరిగోల...వారిది... అన్నట్లుగా జనం! కానీ, నాకే అలా లేదు...! దృష్టికెదురుగానున్న దృశ్యమ్మీదా కేంద్రీకరణలేదు. మనసులో కదలాడే ఆలోచనల మీదా స్థిమితంలేదు. వొక నిలువ లేని, నివారించ శక్యంగాని చలనమేదో నా లోలోపల!

"...మీరెప్పుడు కథ రాస్తారు సార్?" వోసారెపుడో ప్రశ్నించిన బుధడికి అపుడేం సమాధానమిచ్చానో గానీ, సరిగ్గా, యిదిగో, యీ కళాపెళా కల్లోలం అంతరంగం నిండా నిండినట్టుంటుంది. అప్పుడు కథ...రాయటం...!

కానీ, యిపుడెందుకు రాయలేకపోతున్నాను?

"సార్... యెపుడో వొకసారి నా గురించి కథ రాయండి సార్!" అపురూప

కోర్కె... విన్పించేడు బుధడు. విన్పించి చాన్నాళ్లయింది. కథావస్తువుగానే కన్పించేది బుధడి జీవితం! గానీ, రాయబోతే కుదిరేదిగాదు. అక్షరమ్మీద అక్షరం, జ్ఞాపకాలు... అద్దమ్మీద ధారగాపడే వర్షపు చినుకుల్లా...

మహాసముద్రమూ, మహానగరమూ దర్శించటానికెంతో బాగుంటాయిగానీ జీవించటానికంతబాగోవు, తిమింగలాలూ, షార్కులూ, యింకేవో వాటికి మించిన జాతులూ, మహాసముద్రం మధ్యలో జీవిస్తాయి. మహానగరం మధ్యలో గూడా అలాంటి మానవజీవులే జీవించగలవు. చిన్నచిన్న చేపలూ, పీతలూ, నత్తలూ లాంటివి సాగరం మధ్యలో వుండగలవా? అంచేత, తీరానికి సమీపంలో మసలుతుంటాయి.

మహాపట్నంలోని మారుమూల వీధుల్లోని చౌక అద్దెల యిళ్లనెన్నిటినో, యీ యిరవయ్యేళ్లలో చూసేసాను. తొలినాళ్లలో, పల్లె నుండి వొచ్చిన నాకు యీ పట్నం ఉక్కిరి బిక్కిరి చేసింది.

కాలచక్రం తిరిగింది. కాన్వెంట్ నించీ కాలేజీల కెదిగిన రెక్కలురాని పిల్లలూ, పెరిగిన ఖర్చులూ, మార్కెట్ నక్షత్రకుల అప్పుల క్రింద పంటభూములు కోల్పోయి రెక్కలు తెగిన తల్లిదండ్రులు, బతుకు సంద్రంలో మునుగుతున్నానో, ఒడ్డుకు చేరుతున్నానో తెలీని...యీడులాట...! శరీరానికి టూప్లస్ సుగరూ, హండ్రెడవతల బీ.పి. అంటగా – వాలంటరీ రిటైర్మెంటనే తప్పనిసరి విరమణ పత్రాన్ని చేతికందించింది యాజమాన్యం.

నేను రిటైరయినా – నా బాధ్యతలు రిటైరవలేదుగా. చదువులూ, పెళ్లిళ్లూ, సాగరం... యింకా ఈదాలిగా! కెరటాలు ఒడ్డుకు బాదుకున్నట్లు బాదుకునీ – బాదుకునీ – యిక వల్లగాక మహాపట్నానికి కొద్దిదూరంలో వున్న ఊరికి కాపురాన్ని మార్చేను.

ఆ ఊరిలోని – తాటితోపులూ, మెట్టభూములూ, నాగేటిచాళ్లూ, ఆదర్శనగర్. అయోధ్యనగర్, టైలర్స్ కాలనీ, శాయీకాలనీ – యిలా నగర్‌లూ కాలనీలూ అయినాయి. ఆ ఊరి గొడ్డూ, గోదా, ఆవూదూడా, పిల్లమేకా – ట్రాక్టర్లూ, లారీలూ, వేన్‌లూ, ఆటోలూ అయినాయి. ఎన్నో తరాల నుండీ అక్కడ బతికిన చాలా కుటుంబాలు చెదిరిపోయేయి. మిగిలిన కొన్నీ, యిసుక తట్టలూ, సిమెంట్ గమేళాలూ, సిల్క్ చీరలూ, చిరిగిన గావంచాలూ అయినాయి. మహాపట్నంలోంచి తరలించబడే (పట్నాన్ని విశాలంగా, సౌందర్యవంతంగా చేయటంలో భాగంగా) మహా పట్నంలో జీవించలేకా (నాలాగా, చవగ్గా దొరికే అద్దెయిళ్ల కోసం) కొన్ని కుటుంబాలూ కొత్తగా చేరాయి. అది – పల్లే, పట్నపూ సంకీర్ణంలా వుంటుంది!

అక్కడి, మా అద్దె యింటికెదురుగా – వో పూరిపాక! అదే బుధడి ఇల్లు! మహాపట్నపు శబ్దాలూ, చిత్తడి వీధులూ, కొత్త బడ్డీకొట్లూ, అలవాటవుతోన్న కుక్కలూ, పందులూ, సారాకేకలూ, సాయంకాలపు రాగాల మధ్యగా –

"ఫర్లేదులెండి, మీకేం ఫరవాలేదు. ఇక్కడ బాగానే వుంటుంది. అన్నీ దొరుకుతాయి. ఇంచుమించుగా యిదీ సిటీయే! సిటీకెళ్లాలన్నా - పెద్ద దూరం కాదు. మాకైతే, కేరేజీ కూడు దూరం..." అంటూ పలుకరించేడు బుధడు.

దూరాన్ని - కొత్త కొలమానంతో కొలిచిన బుధడు, తొలి పరిచయంలోనే నన్నాకర్షించేడు. మానవ జీవితంలోని అపురూపమైన యవ్వన దశలోని, అందాన్నంతటినీ రూపెత్తుకున్నట్టు కన్పించేడు.

ఆ తర్వాత - ఉదయమూ, సాయంత్రమూ - తారసపడేవాడు. చిరునవ్వు నవ్వేవాడు. ఎప్పుడూ, యేదో పనిలో వుండేవాడు. బుధడ్ని నా పెద్దకొడుకుతో పోల్చుకునేవాణ్ణి. ఇంచుమించుగా యిద్దరిదే వొకేయీడు. నా పెద్దకొడుకు కదిలే పుస్తకం అన్పిస్తే, బుధడు కదిలే జీవితం అన్పించేడు...!

పెద్దగా కెరటం... దాదాపు కాళ్లదాకా! విసుగ్గా లేచేను. ఆ చివర యెక్కడో, ఆర్కెస్ట్రా విన్పిస్తోంది. జనం అటువేపు వెళ్తున్నారు. ఎవరో, అల్లరి కుర్రాళ్లిద్దరు... కెరటాల్ని ఎదురు రొమ్ముల్తో ఢీ కొంటున్నారు. "రొమ్ము దమ్ము కాలం కాదు సార్ యిది. సొమ్ము (డబ్బు) దమ్ము కాలం సార్..." అనేవాడు బుధడు. మళ్లీ బుధడే జ్ఞాపకమొస్తున్నాడు....

బుధడికి - తల్లీ, దండ్రీలేరు.

మూడేళ్ల కిందట తాపీ కడిగేసెళిపోయేడు మా నాయిన అంటాడు బుధడు. సాయంత్రం వేళ తాపీపనివారు తాపీలు కడిగేస్తారు, దాంతో, పని ముగించినట్టే, బుధడి తండ్రి, తాపీమేస్త్రీ! తండ్రిని తల్చుకుంటూ, యేడాత్తర్వాత తల్లి వెళ్లిపోయిందట. నాయనమ్మా, వో అక్కా, వో చెల్లీ.... వున్నారు. అక్కకు పెళ్లయిపోయింది. గానీ యెక్కువ దినాలు యిక్కడే వీరితోనే వుంటుంది.

".....అంతా ఆడమేళం సార్. మనమొక్కళ్లమే మగమారాజులం" అంటాడు బుధడు. దానికా నాయనమ్మ బోసినోటితో వెక్కిరిస్తూ -

"...వోరె, వొల్లకోరా, వల్లకో. మగమారాజట...మారాజు...అసలకి, నువ్వీ యింటి పిల్లడివేకావు. సాలిహుండం యాతర్ల, ఆ కొండ కాడ దొరికేవు. బుద్ధ తూపమంతారే, అక్కడ కూకొని యేడస్తన్నావు. అయ్యో పాపం అని యెత్తుకున్నాం...." అనేది.

"...ఒలే ముసిలీ, వొయిజాగు జువ్వ లొాదిలీకే..." అనేవాడు బుధడు.

"అదా.... జువ్వలంతాడు...!" అని బుధడి వ్యాఖ్యను ఖండిస్తూ మరింతగా విశదపరచబోయేది ముసల్ది.

"కాకపోతే... మరేటే? ఎక్కడి వొయిజాగు? ఎక్కడి శాలిహుండం? అసలది యే జిల్లాలో వుందో తెలుసా నీకు?"

"...అదేమరీ, సంద్రంలో ఉప్పుకీ, చెట్టుమీది కాయికీ బంధమంటే! మాది యే వూరనుకున్నావ్? శాలిహుండం కొండకి యెడమ పక్కలెల్లి వొంశిధార నది పారుతుందా? అది, అలాగ యెల్లి, కిందని కళింగపట్నం కాడ సంద్రంల కలస్తాదా? ఈ మద్దెకాన, వొంశిధార అవతలవొడ్డున వొక ఊరుంతాదా? అదే వొనిత మండలం! అది నీను పుట్టినూరు. నా కన్నోరూరు! అక్కడ – ఆడదే... మారాజు! వొరే – మా రాజ్జెంరా... అది! అసలకి – మా పూర్వీకులు – ఆడపిల్లల్ని తప్పా మగపిల్లల్ని కనీవోరు కాదట తెల్సా...?" అని వివరించేది ముసల్ది.

"ఔనే, నిజ౦వే! ఒలే ముసిలీ – నువ్వు – నీ కొడుకుని కనలేదేమో. దొరికుంటాడేమో. గానీ మా అమ్మ మాత్రం – నన్ను కనీ, పెంచింది...!" అనేవాడు.

అందుకు, ఆ ముసల్ది బుధడ్ని తీసిపారేసే రీతిలో –

"...ఔరా, అసలకి నీ పేరే యిసిత్రంగా లేదా? మన వొంశింలోనగాని, మన కులం లోనగాని, యెవులికేనా – నీలాటి పేరున్నాదా? సెప్మిరా?...?' అని ప్రశ్నించేది ముసల్ది.

బుధడు – ఆలోచనల్లో పడేవాడేమో...!

"...బుద్ధుడి తూపం కాడ దొరికినావు – బుధడివైనావు...! అప్పుడి – కతంతా – సెప్తాను. యిను" అని ఆరంభించేది ముసల్ది.

సాయంత్రపు వేళ... యింటెదురుగా నిల్చుంటే – యెదుటి పురిపాక ఆరుబయట – వినవచ్చిన సంభాషణ.. ఇది!

ఆ ముసల్ది – వాస్తవంగా జరిగిన గతాన్ని చెప్తోందా? లేకా... వొక కాల్పనిక కథనా....?

"...శ్రావణమాసపు రోజులు, వొకరోజు – మేఘాలు నల్లగా ముసుగేస్సినాయి. ఊరూ, వాడా, తోటా, దొడ్లూ – సీకట్ల ములిగిపోనాయి. వొర్సం ఆరంభించింది. ఒక పగలూ, వొక రేయీ – అలాగ కురిసింది. మర్నాడు పొద్దుటి పూటా – అలాగే వుంది. వొర్సానికి గడపదాటి – బయటికెళ్లలేదు. కాళ్లు కట్టేసినట్టుగుంది – మా యీడు పిల్లలకి! అందరం – ఎవరి యిళ్లల్ల, గడపలమీద వాళ్లు కూచొని – వోన యెపుడు తగ్గతాదా అని చూస్తన్నాం. ఎప్పుడు – యేరునీ, తోటల్నీ, పైరు పంటల్నీ పలకరించొద్దామా అని చూస్తున్నాం. ఇంటి ముంజూరు చినుకుల ధారల్లోంచి – సాలిహుండం కొండ – తొండం సాచి తొంగొన్న ఏనుగులాగవుపిస్తంది. వొంశిధార జేగురురంగు వొరదతోటి పొంగిపొర్లుతోంది. భోరుమని గాలి...! ఆ గాలికి సరుగుడు చెట్లు – ఝుయ్యిమని ఊగుతున్నాయి.

ఆ సాయంత్రానికి – వోన ఆగిపోయింది. పడమరకి పొద్దు కనబడింది. వాన

వెలిసీ, పొద్దు పొడిచిన వెలుగులో – నీటితో నిండిన వీధులూ, చెట్లూ చేమలూ, చిత్రమైన కాంతిలో మెరస్తన్నాయి. తూరీగలు – రెక్కల్ని ఆరేసుకుంటున్నాయి. చిలుకలు – ముక్కుల్ని చెట్ల కొమ్మల మీద రాస్తూ–రాగాలు తీస్తున్నాయి. కాకులు – ఊరిచెరువు మీదుగా కావ్‌కావ్ మంటూ యెగురుతున్నాయి.

గడపలు దిగి – వీధుల్లో కొచ్చేం. నుదుటి మీది సాయంత్రపు పొద్దునీ, వింతయిన వెలుగునీ అరిచేతుల్లోన చూసుకొని, వొకర్నొకరు పిల్చుకొనీ – అమ్మలక్కలందరం – తోటలూ, దొడ్లూ తిరిగేం. అందరంవూ, అటూయిటూగ వొకే యీడు పిల్లలం. నీనే.... ఆళ్లందరికీ పెద్ద. నా వెంట నడుస్తూ – అందరూ! సాలిహుండం కొండెక్కాం! పొంగి పొరిలే వొంశిధార, అల్లంత దూరాన సంద్రం, మంచుఅలికేసి పచ్చని పొలాలు – ముద్దలా జేగురు కొండలూ – ఎంత బాగున్నాయో చూడ్డానికి!

అక్కడ వొక రాతిబండ మీద 'అతడు' ! నదినీ, సంద్రాన్నీ, పొలాలనీ – సమస్తాన్నీ మైమరచి చూస్తండో; దుఃఖపు వోనకి తడిచి, తడిచీ మూగబోయినాడో–మమ్మల్ని గమనించలేదు. మొలకి కట్టిన చిలకట్టు తప్పా – మిగిలిన శరీరమంతా నగ్నమే. జేగురు రంగులో పొద్దువాలిన వేళ... మెరుస్తూ కన్పించేడు....! ఎవడు? ఏ ఊరివాడు? తప్పిపోయిన వాడా? తరలివచ్చినవాడా.........

ముసల్ది – పరిసరాల్ని మరచి, గతంలో లీనమయి – చెప్పుకొస్తోంది. ఆమె ఆఖరి మాటలూ, ఆ కథనమూ... నా జ్ఞాపకాల్లోని వొక దుఃఖపు నదిని – కదిపేయి...! జ్ఞానం పొందుపడే వయసులో జరిగిన ఘటన మెదడులో సుళ్లు తిరిగింది... మా ఊరిలోని. నా బాల్యం.......

'వాడు' నా యీడు వాడు. పేరు మర్చిపోయేను. గుర్తుకు రావటంలేదు. ఒక అస్పష్టరూపం మాత్రమే మెదడులో వుంది! వాడూ, నేనూ వొకే వీధిలోని యెదురెదురు ఇళ్ళ వాళ్లం. ఇద్దరం, మా ఊరికి రెండు కిలో మీటర్ల దూరంలోని కోటిపాం హైస్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్నాం. మా యిద్దరి దినచర్యలు పరస్పరం కన్పించేవి. ప్రతిబింబించేవి.

మాది నాగాళి నది ఒడ్డు గ్రామం. ఆ నది మా గ్రామానికి తాగునీటిని తప్పా – సాగునీటిని అందించేది కాదు. జమీందార్ల, మొఖాసాదార్ల, ఆ తర్వాత తెల్లదొరల చేతుల్లో మా ఊరి భూములుండేవి. స్వాతంత్ర్యం వొచ్చిన కొన్నాళ్లకి ఆ భూములు కొందరు రైతుల చేతుల్లోకి వొచ్చేయి. ఎప్పుడూ అవి వర్షాధార భూములే! అందుకని అతివృష్టీ, అనావృష్టీ యేదో వొకటి యెపుడూ బాధించేది మా ఊరిని.

రాతుల్తో, గోతుల్తో వీధులూ, పూరిళ్ల వాసలూ, చిరిగిన తలపాగాలూ, రోగాల

వృద్ధులూ, ఆకలి యువకులూ చీటికి మాటికీ వొకర్నొకరు సంహరించుకొనే ఆగ్రహంతో కొట్లాడుకుంటూ, అంతలోనే అంతట్నీ మర్చిపోయి, బీరపీచులాంటి బంధుత్వాన్ని కలుపుకునే మనుషులూ...! అదీ... మా ఊరు....!

వాడి తండ్రి అప్పలస్వామి పశువుల వ్యాపారి. మా ప్రాంతంలో వారంలోని అన్ని రోజులూ యెక్కడో ఒకచోట సంతలు జరుగుతాయి. ఈ సంతలు మాకు బయటి ప్రపంచానికి తెరచిన ద్వారాలు. పశువుల సంతలు మాత్రం లక్ష్మీవారం, శనివారం, పార్వతీపురం, కూనేరు రెండు ఊళ్లలోనే జరుగుతాయి. ఇక్కడ కొని, అక్కడ అమ్మటమో, అక్కడ కొని యిక్కడ అమ్మటమో చేసేవారు. ఈ వ్యాపారుల్ని దళారులనేవాళ్ళు. అందుకునే వాడి తండ్రిని దళారి అప్పలస్వామి అనేవారు అందరూ, అతని యింటిపేరు వొదిలేసారు.

దళారి అప్పలస్వామి, సంత నుండి వొచ్చేక, పశువుల్ని సాలలో కట్టడంగానీ, వాటికి కుడితి నీళ్లు పెట్టడంగానీ చేసేవాడుకాడు. బాగా సారా తాగటంతో, తూలుతూ, మత్తుగా వొచ్చేవాడు. పశువుల వెంట వొచ్చి – పెరటిసాలలోకి పశువులు వెళ్తే, అప్పలస్వామి పెరటి ద్వారం గుండా ఇంటి వీధి అరుగు మీదకి చేరేవాడు. అరుగుమీద చేరబడి... 'స్థిరమై సంపదలెల్ల...' పద్యం యెత్తుకునేవాడు. పొద్దుగూకీ, చీకట్లు ముసిరే ఆ వేళలో, ఆ యింటి ఇల్లాలు – దీపం వెలిగించటం, పొయ్యి వెలిగించటం పనుల్లో వుంటూ సరిగ్గా అంటుకోని చిదుగుల్లా చిర్రుబుర్రుమనేది.

పశువులకి కుడితినీళ్ళుపెట్టి, సాలలో కట్టేసి, గడ్డిపరకలు వాటి ముందు వేసి – వాట్ని కళ్లారా వోసారి చూసి – వీధి అరుగుమీదికి వొచ్చేవాడు – 'వాడు'. అప్పుడు దళారి అప్పలస్వామి లాల్చీజేబులోంచి–అంకుడు ఆకుల పొట్లాంలో కట్టిన కజ్జి వుండలూ, జంతికలూ యిచ్చేవాడు.

వాడు – ఆ పొట్లాం విప్పుతూ – నా దగ్గరకు పరుగెత్తుకొచ్చేవాడు. ఇద్దరం – వాట్ని తింటూ, కబుర్లు చెప్పుకుంటూ, పశులసాలకు వెళ్తూ – కొత్తగా. చేరిన పశువుల్ని పరిచయం చేసుకునేవాళ్లం, వాటి గంగడోళ్లూ, భుజాలూ దువ్వేవాళ్లం........

నేను – నా గత జ్ఞాపకాల్లో నుండగా ! ఆ ముసల్ది –

"...పిలిస్తే పలుకులేదు, ఉలుకులేదు. మూగోడు అనుకున్నాం. మాతో వస్తావా అనడిగేం. కళ్లు మెరిసేయి.... లేచేడు బండ మీంచి.... నీనే – అతడి చేయి పట్టుకున్నాను. నాతో నడిపించేను. నా నేస్తురాళ్లు–అతణ్ణి ముట్టుకోడం, భుజాల్ని తట్టడం, జేగర్తగా నడువ్‌మీ – నీ కస్సలు మాటాల్రావా? తెలుగు రాదా? వొరియా దేశిమానీది.... యిలా ప్రశ్నలు వేస్తే, అతడు మెరుపు మెరిసే కళ్లతోటి చూసి, పెదిమిలు విప్పీ విప్పకుండా నవ్వేవోడు. తిన్నగా మాయింటి కొచ్చేము.

మా యింట్లోని వోళ్ళూ, యిరుగూ పొరుగూ చేరిపోనారు. తలావొక ప్రశ్నలు....

"ఏ వూరు...?"

మెరిసే కళ్లతో చూట్టం తప్పా, పలికే వోడుకాదు.

"నీ తల్లిదండ్రులెవరు....?"

"...."

కొంతసేపటికి, యేమేమో మాట్లాడి, యిరుగూపొరుగూ ఒక్కొక్కరూ వెళిపోయేరు. మా యింటివాళ్లు మాత్రం అతడికి - కాళ్లు కడుక్కోమని నీళ్ళిచ్చేరు. తుడుచుకోమని - తుండుగుడ్డ యిచ్చేరు. తిండి పెట్టేరు. పండుకోమని - గడప చూపించేరు. అలాగ, ఆరోజు మా యింట చేరిన 'అతడు' మూడు రోజులు - ఉలుకూ పలుకు లేదు. యేదో పోయిన దాన్ని వెదుకులాడే వోడిలా - సాలిహుండం కొండా, నదీ, పొలాలూ తిరిగేవోడు. పోద్దోయి యిల్లు చేరేవోడు.

నాలుగోరోజు - పొద్దుగుంకేవేళ - పొలాల మీదుగా చల్లగా గాలి. యింటెదురు వీధి గడపలోంచి... తరంగాలు, తరంగాలుగా.... పిర్నగ్రర (పిల్లనగ్రోవి) పాట...! పాటవేపు పరుగెత్తేను. వీధీ, ఊరూ, పరుగెత్తుకొచ్చింది. పిర్నగ్రర ఊదుతూ... పాటల్ని యీ ప్రపంచాన్ని సేద తీర్చటానికంపించే.... 'అతడు'! అందరం - పాట చుట్టూ, అతడి చుట్టూ చేరిపోయేం...!

ఆ ముసల్ది వొక జానపద కథనాన్ని వివరిస్తున్నట్లు వివరిస్తోందిగానీ, నా గత జ్ఞాపకాల్ని తవ్వుతూ.... వొక్కొక్కటే వెలికి తీస్తోంది ఆ కథనం. మళ్లీ 'వాడు' గుర్తొచ్చేడు నాకు......

అవి వేసవి రోజులు. బడికి సెలవులు. మాకు వేసవిలో ఎండలు కాయటంగాదు - పండుతాయి! చుట్టూ కొండలు గదా, అందుకని. నాగావళి నది గూడా ఎండిపోయి, సన్నగా అవతలి ఒడ్డువేపు ప్రవహిస్తోంది. ఎండలూ.... కరువూ....! ఆకూ అలములూ, పశుపక్ష్యాదులూ, మనుషులూ తిండికీ నీటికీ కటకటలాడుతున్నారు. పొలాలూ, గుండెలూ- బీటలువారీ, పగిలీ... యెండిపోయి వున్నాయి. అటువంటి వొక వేసవి సాయంత్రపు వేళ - దళారి అప్పలస్వామి పశులసాలలోకి రెండు ఆవులు - యెవరివో, యెక్కడివో వొచ్చి చేరేయి. ఎండిన డొక్కల్తో, దుమ్ము బట్టిన దేహాలతో, అలసటతో ఊగిపోతూ, దాహంతో రొప్పుతూ సాలలో నిల్చున్నాయి!

"వాడు" చూసేడు...!

గభాల్న, పెరటిలోనున్న కుడితికుండను - కుడితి గోళెంలో వొంపి, యింట్లో వెదికీ వెదికీ - యిన్ని ఉప్పుగల్లు తెచ్చి కుడితిలో కలిపి ఆ ఆవుల్ని గోలేం దగ్గరకు తోలుకొచ్చి కుడితినీళ్లు పెట్టేడు.

అప్పుడు – ఎదుటివాసలో నిల్చుని చూస్తోన్న నన్ను పిల్చుకొచ్చి, వాట్ని చూపిస్తూ–

"....పాపం! యెక్కడ్నుండొస్తున్నాయో, అలిసిపోయేయి. దాహమెత్తి పోయేయి. చూడ్రా, యెలా తాగుతన్నాయో..." అంటూ, అవి కుడితినీళ్లు తాగుతుండగా వరిగడ్డి పరకల్ని తెచ్చి, చిన్న బెండుగా చేసి, ఆ ఆవుల దేహాల మీది దుమ్మూ, ధూళీ తుడిచివేస్తూ –

"...చూడ్రా...యెంత బాగున్నాయో! యెవులివో? యెక్కడివో? తప్పిపోనాయి గావాల...! పాపం ఈళ్ల అమ్మ యెంత యేడుస్తన్నాదో? ఔన్రా... యింకా యీటికి గంగడోలు దిగలేదురా! ఒరే.... దీనికి కుడి తొడమీద చూడ్రా... ఎంత చక్రం వుందో...? ఇది అన్నీ కోడెదూడల్నే – ఈనతాదిరా... పెద్దయ్యేక..!". యిలా, ఆ రెండింటినీ పరిశీలిస్తూ సపర్యలు చేస్తూ, అవి కుడితినీళ్లు తాగేక – వాటిని సాలలో రెండు రాటలకు కట్టివేస్తూ –

"... ఎంత బాగున్నాయో కదా! ఎవళివో కదా? వెదుక్కొంటూ, వాళ్లు రారుకదా? మా నాయనా – యీటిని సంతల్ల అమ్మేస్తాడేటో కదా?" ప్రశ్నలూ, సంశయాలూ – విన్పించేడు.

వారాలు గడిచేయి. నెలలు గడిచేయి. వేసవిపోయి–తొలకరి వొచ్చింది. పచ్చదనం పరుచుకుంది. ఊరూ... కళకళలాడింది. పొలాలు – పంటల బిడ్డల్ని యెత్తుకున్నాయి.

ఆ ఆవులు – రెండూ బాగా, బలిష్టంగా తయారయ్యేయి. వాటి యజమానులెవరూ రాలేదు. దళారి అప్పలస్వామి గూడా – వాటిని సంతల్లో అమ్మకానికి పెట్టలేదు. 'వాడు' తీరిక సమయమంతా వాటితోనే గడిపేవాడు. నేనంతగా – పట్టించుకోలేదు. కొన్నాళ్లకి వాటిలో వొక ఆవు – కోడెదూడను కన్నాది. జున్నూ, జున్ను పాలూ – పంచి, ఆ దూడను నాకు చూపి, యిక వాడు యెంత మురిసిపోయేడో...! ఇక వాడికి ఆ 'దూడ' సర్వస్వం అయ్యింది. చదువుతున్న పుస్తకాన్ని – దూడ నాలుకతో చప్పరిస్తే – 'వాడు' నవ్వి పుస్తకాన్ని దాని తలపై పెట్టి మోర నిమురుతూ పుస్తకంలోని పాఠాలు దానికి చదివి విన్పించే వాడు.

దూడనూ, వాడినీ వొదిలేసి ఆ రెండు ఆవులూ యెటో వెళ్లిపోయేయి. కొన్ని రోజులు యెదురు చూసేరు, వాడూ, దూడా! పొలాలూ, తోటలూ, బాటలూ తిరిగేరు. కన్పించలేదు.

"...ఎలాగొచ్చినాయో అలాగెల్లిపోనాయి! మన యింట తిండి తిన్నాయి గాబట్టి – ఆ ఋణం తీర్చడంకి – దూడని కనీ, మనకొదిలీసెళిపోనాయి. ఇకంతే, అవి మరి తిరిగిరావు. మర్చిపోవడమే..." అనేవాడు అప్పలస్వామి.

గానీ – 'వాడు' అలా మర్చిపోలేకపోయేవాడు. దూడ గూడా ! బెంగపెట్టుకుంది. గెంతులూ, పరుగెత్తడాలూ లేవు. మూగగా, దిగులుగా కట్టుకొయ్యవద్దే వుండేది. దాని ప్రక్కనే "వాడూ"! దూడా పలికేది కాదు, వాడూ పలికేవాడు కాదు.

కొద్దిరోజుల తర్వాత – సంతలో అప్పలస్వామి మీద యెవరో దాడిచేసి కొట్టిపడేసారట! ఆవుల తాలూకా, అసలు యాజమానులయి వుంటారేమోనని గ్రామస్థుల అనుమానం! అప్పలస్వామి – పట్నం ఆస్పత్రిలో చేరేడు. గాయాలతో తీసుకొని, తీసుకొని వారం రోజులు బాధపడి, బాధపడీ మరణించేడు !

ఊరిలోకి యీ వార్త వచ్చింది. అప్పలస్వామి మృతదేహం తీసుకురావటాని కెవరో – ఎడ్లబండి తోలుకెళ్లారు. రాత్రవేళ.... చీకటి దుప్పటి చుట్టేసుకుంది ఊరు. సన్నగా వానతుంపర. గ్రామస్తులంతా – శోకంతో అప్పలస్వామి గడపలోనా, యిరుగూ, పొరుగూ, ముంజూరు అరుగులమీదా చేరేరు. ఆ గ్రామంలో తమ ముందరితరం వారి చావూ, పుట్టుకల నించి ఆరంభించి – తమ కాలానికి – గ్రామ పరిస్థితి వరకూ వాళ్లు కబుర్లు చెప్పుకోసాగేరు – పట్నం నించి రావల్సిన ఎడ్లబండి కోసం యెదురు చూస్తూ! ఆ చీకటిలో, ఆ శోకంలో, నా కళ్లు వెదికేయి దూడ కోసం, వాడి కోసం...!

దూడా లేదు, వాడూ లేదు...! మరి కన్పించలేదు. యిప్పటిదాకా........

"ఆ వేళ్టినిండీ, 'అతడు' పిర్నగ్రతో – ఊరందర్నీ నాగస్వరం ముందరి పాముల్ని జేస్సాడు. అందరికీ బంధువై పోయేడు. అందరిళ్లలో భోజనాలు, అందరి పనులూ... అతడే చేసేవాడు. ఊరిలోని సంబరాలకి – ఆటా పాటలకి అతడే కేంద్రం. సంగిడీలు యెత్తటం, గూటాలు తిప్పటం, కర్రసాము... వొక్కటేటి అన్నీఅతడే, విజేత!

'అతడు' నా ధ్యాస, నా ఊసూ... అయిపోయేడు! గానీ, వొకనాడు 'అతడు' కన్పించలేదు. తోటలూ, దొడ్లూ, కొండా, నదీ... వెదికేం! ఊసుల, ధ్యాసల తోటలో దీపం అరిపోయింది! పిల్లనగ్ర., వొంశిధార నదిల కొట్టుకుపోతూ కన్పించిందనే వారు కొందరూ, ఎలా వొచ్చేడో అలా పోయేడని కొందరూ.

ఆ ముసల్ది తన బాల్యం నాటి జ్ఞాపకాల్లోంచి, బుధడ్ని చూస్తోందా – ప్రశ్న కల్గింది నాకు.

"నైన్‌టీన్ ట్వంటీ లవ్‌స్టోరీ సార్. మా తాతకిగాని యీ లవ్‌స్టోరీ తెలిసుంటే పిర్నగ్ర వంశధారల కలిసిందిగానీ – యీ ముసల్ది మాత్రం సముద్రలం కలిసుండేది..." అనేవాడు బుధడు.

అక్కడితో, ఆ సంభాషణని ఆపేసి, బయటికి బయల్దేరేవాడు బుధడు.

"యిప్పుడింకా పట్నం పని నించి వొచ్చేవు. అప్పుడే పారిపోతావేటిరా? వొకసిటం కూకోరా...." అని ఆపబోయేది ముసల్ది.

"ఇంటిల కూకోని, హాయిగా అనుబగించటానికి – నీలాగ ముసిలోడ్ని కాను, నీ మొగుడు సంపాయించి వొదిలీసిన ఆస్తీలేదు – నువ్వు తప్పా" అని బదులిచ్చి వెళిపోయేవాడు బుధుడు.

తండ్రి చనిపోయే నాటికి ఇంటర్మీడియట్ పూర్తయ్యిందిట. తండ్రి మరణంతో యేదో కంపెనీలో నౌకరీకి చేరేడుట. చాలీచాలనీ జీతం! అపుడే పరిచయమైన గ్రామీణ బ్యాంక్ ఫీల్డాఫీసర్ వలన, యిక్కడి జంక్షన్‌లో ఎస్‌టిడి బూత్ పెట్టేడట. చెల్లి చూస్తుంటుందది. సాయంత్రం వొచ్చి ఆమెని రిలీవ్ చేస్తాడు బుధడు.

"మీరు కథా రచయిత గదా? తెల్సింది లెండి సార్. యీ జంక్షనూ, బస్టాపూ జనం గురించీ చెప్తాను కథ రాయండి..."

నగరంలో పనిబడి బయల్దేరి ఓ రోజు బస్టాపు దగ్గర నిల్చున్నవేళ, ఉదయం తొమ్మిది గంటల వేళ. కేరేజీ పట్టుకు బుధడు వొచ్చేడు! నన్ను నవ్వుతూ అలా పలకరించి–

"...యింతకు మునుపు యిక్కడ బస్టాప్ వుండేదిగాదు. అదిగో, ఆ యెదర – ఆయిల్ మిల్లుందా? అక్కడాగేవి. మన కోలనీవోళ్లు అక్కడికి నడిచెళ్ళేసరికి – బస్సెళ్లిపోయే దొక్కోసారి! డూటీలకి లేటవటం – చచ్చీచావు గుండేది. ఏం చెయ్యిడంరా దేవుడా అనుకోనీ వోళ్లం!

ఇక్కడి జనాలతో – దీని గురించి ఆలోచిస్తే "ఏటీ చేస్తామేయ్? బేగా తయారై, బేగా నడిచి, ఆ మిల్లుకాడికి చేరి బస్సందుకోడమేనెయ్..."! అనేవోరు. బస్టాపు గురించి ఆలోచించీవోరుకారు.

ఇంతలోకి – ఎలక్షన్ లొచ్చేయండి. మన లోకాల్టీకి వొక లీడర్ బయల్దేరేడండి. మీకు అతగాణ్ణి చూపిస్తాన్లెండి. ఇక్కడే మన లోకాల్టీలోనే వుంటాడు. అతనికి సిటీల ట్రావెల్ ఏజెన్సీ, మిల్క్‌ఫుడ్ సెంటర్ వుంది. ఇక్కడ ఐస్ ఫ్యాక్టరీ వుంది. అతగానికి ప్రజాసేవ చెయ్యాలని బుద్ధి పుట్టింది. అధికార పార్టీ, బరిలోకి దింపింది.

ఆయనకి పోటీగా – లోకల్ నాయుడు గారబ్బాయి నిల్చున్నాడు. ఆ యిద్దరూ పోటాపోటీగా ప్రజాసేవకి దిగేరు. నమస్కారాలూ, పాదయాత్రలూ చేసేరు. వాగ్దానాల మీద వాగ్దానాలు చేసేరు.

అప్పుడు మనమూ – ఎవరిక్కడ బస్టాప్ పెట్టించితే – వారికే ఓటు అన్నాం. ఐస్ ఫేక్టరీ లీడర్ గెలిచేరు. ఆయన చలవవల్ల మనకీ బస్టాప్ వొచ్చింది..." అని వివరించేడు, బస్టాప్ కథను !

అంతలో బస్సొచ్చింది ఎక్కేసాం. ఉద్యోగులూ, తాపీపనివాళ్లూ, కూరగాయల వ్యాపార్లూ, కార్మికులూ, కళాసీలు రకరకాల జనాలతో – కిటకిటలాడ్తోంది బస్సు. సినిమాల గురించీ, సిటీలో విశేషాల గురించీ, యింట్లో గొడవల గురించీ, ఫేక్టరీలో వర్క్ గురించీ యిలా నాన్‌స్టాప్‌గా కబుర్లు చెప్పుకుంటున్నారందరూ – అంత రద్దీలో నిల్చుని గూడా! బుధడు నావేపు చూస్తూ –

"...యేం సార్? సిటీ వెళ్తన్నారు? ఏఁవేనా ప్రైవేట్ జాబ్ ట్రయల్సా...?" అనడిగేడు.

ఆ మధ్య వోరోజు కలిసినపుడు మాటల్లో అన్నాను – ఖాళీగా వుండటం కష్టంగా వుందయ్యా, యేదేనా ప్రైవేట్ జాబ్ ట్రయ్ చేద్దామా అన్పిసోతందని...

బహుశా అంచేత – అలా ప్రశ్నించి వుంటాడు.

ప్రయత్నిస్తే మాత్రం – జాబ్ దొరకుతుందా? అంత సులువా? ఒకవేళ దొరికినా యీ శరీరాన్ని ఆవహించిన వయసూ, బీపీ, సుగరూ – యిలా బస్సుల రద్దీకీ, పని భారానికీ తట్టుకొని నిలుస్తుందా? అన్నీ ప్రశ్నలే.

బుధడి ప్రశ్నకు – జవాబివ్వలేదు. కాసేపయ్యాక, బుధడే –

"...కష్టంలెండి," అని నిట్టూర్చేడు.

జాబ్ దొరకడమా, చేయటమా? ఏది కష్టం? రెండూనా...? నేనేది ఆలోచిస్తూ, ప్రశ్నార్థకంతో వుండిపోయేనో – సరిగ్గా దానికే జవాబు చెప్పిన బుధడి వేపు ఆశ్చర్యంగా చూసేను.

"...మా ఎస్టీడీకి అపుడపుడొస్తుంటాడు. హైవే రోడ్ కాంట్రాక్ట్ వర్క్ కంపెనీ మేనేజర్ గారు. మంచోరు. ఆయన్ని అడుగుతాను. మీరు ఎండలోన, పని దగ్గరుండలేరు గదా – యేదేనా ఎకౌంట్స్... రాతా, కోతల పనయితే చెయ్యిగలరుగదా....?" అని ప్రశ్నించేడు బుధడు.

నా మొహంలో – వెలుగు కన్పించిందేమో

"....మనకది చేతగాదు. రాతకోతలకి పనికిరానునేను..." అని నవ్వేడు. నవ్వి రోడ్డు వేపు చూసి –

"మీరు రిటర్న్ యెపుడెళ్తారు?"

"...మధ్యాహ్నం భోజనానికళ్లా తిరిగొచ్చేస్తాను." చెప్పేను

"అయితే, సాయింత్రం కలుద్దాం. అదిగోండి, ఆ స్టాప్‌లో దిగి నాలుగడుగులేస్తే మా కంపెనీ...! "రాజ్యం స్టీల్స్...!" మరి వొస్తానండీ..." అనేసి జనాల్ని ఖాళీ చేసుకుంటూ డోర్‌వేపు నడిచేడు బుధడు! వొక సామూహిక యాత్రలో – యేకైక పరిచయస్తుడు వెళ్లిపోతే, మిగిలిన సమూహంతో వొంటరిగా ప్రయాణిస్తున్నట్టన్పించింది ఆ బస్సులో నాకు...!

బుధడుతో చెప్పినట్లు – నేను మధ్యాహ్న భోజన వేళకి తిరిగి రాలేకపోయేను. పనులు తేలకపోవటం, కలవవలసిన వాళ్లను కలవటానికి సాయంత్రం వరకూ వేచివుండాల్సి రావటం – సాయంత్రం ఆరు దాటిపోయింది. యేదో షేరింగ్ ఆటో యెక్కేను – జంక్షన్‌లో దిగి అక్కడ్నించి నడిచేవచ్చులే అనుకొని.

జంక్షన్‌లో ఆటోదిగి – మా కోలనీ దోవవేపు నడిచేను. ఆ దోవకు ఎడమవేపు

బుధడి ఎస్టీడీ బూత్. అప్పటికే, బుధడు పట్నంలో పని ముగించుకొని, యింటికెళ్లి కేరేజీ పడేసి, తిరిగొచ్చేసినట్టుంది. స్టూలు మీంచి లేచొచ్చి –

"ఇంతవరకుండిపోయారా సార్? రండి, రండి, ఆటో యెందుకెక్కారు? కోలనీ బస్సు యెక్కలేకపోయారా..." అని పలుకరించేడు.

చిన్నబడ్డీ. చెక్కలకు రెండు కేలండర్లు. ఒకటి గ్రామీణ బ్యాంక్ వారిదీ, మరోటి యేదో టూరిజం సంస్థ వారిదీనూ! ఒకటి ధనం దాచుకోమని చెప్తే, మరోటి ఖర్చుకి వెరవకుండా సుందర దృశ్యాల్ని సందర్శించండంటోంది. పడమర కిటికీలోంచి గాలీ, ధూళీ, హైవే మీద బోయే వాహన రొదా –

బుధడు చూపిన స్టూల్ మీద కూర్చుంటూ –

"...ఎలాగుంది బిజినెస్" అనడిగేను.

"...మూడులోకల్ కాల్సూ, ఆరు ఎస్టీడీల కాల్సుగా వుండేది సార్ మొదట్లో నేను యిది పెట్టినపుడు! గానీ, యిదిగో జంక్షన్ డెవలప్ గావటం, మన కోలనీ గూడా పెరిగిపోవటం, బిజినెస్ పర్సన్స్ కళ్లు పడ్డాయి. మొదట, అదిగో ఆ బడ్డీ చూడండీ, అమ్మాయి కూచొని కునికిపాట్లు పడ్తోంది, ఆ బడ్డీ వొచ్చింది. వికలాంగుల కోటా కింద సబ్సిడీతో బ్యాంకులో ఋణం తీసుకొని ఎస్టీడీ బూత్ పెట్టిందావిడ. ఇదేవిట్రాబాబని నుదుట మడతలొచ్చినట్లు, కళ్లు చిట్లించి, చూసేను. తర్వాత, పాపం ఆడపిల్ల అంగవైకల్యమూ, సర్లే – యెవురి బేరాలు ఆళ్లకి రావా, అనీసుకొన్నాను.

గానీ, ఇంతలో ఆర్నెళ్లు కిందట – యిదిగో యీ రైట్‌కి చూడండి. చిన్న కమర్షియల్ కాంప్లెక్స్ అవుపిస్తందా? ఒకటి కిరాణాషాపు, మరోటి కూల్‌డ్రింక్సూ, ఫ్రూట్స్‌షాపు, యింకోకటి జిరాక్సూ. ఎస్టీడీ షాపు...! ఆ మూడు వొక్కడివే! ఆ బిల్డింగూ అతడిదే. ఇంకా బ్యాంక్‌లో అప్పు తీసుకొని, పై ఫ్లోర్స్ లేపి – ఎలక్ట్రానిక్ గూడ్సుషాపు, ఎంటర్ ప్రైజెస్ బిజినెసూ చేస్తాడట! చూసేరా – నీల్‌కమల్ చెయిర్లూ, న్యూస్‌పేపర్లూ, మ్యూజిక్కూ – కస్టమర్లని లాగేస్తున్నాయి. ఎవరిబేరాలు, ఆళ్లకి రావా అనుకున్నానుగానీ రావు అని తేల్చిపారేసాడతగాడు.

బేరాల్లేవు. బేంకు వాయిదాలు కట్టలేకపోతన్నాను. ఫీల్డాఫీసురొచ్చి కయ్యిమంటాడు. తైతైమని గెంతుతాడు. తాళాలేసెస్తానుసుమా బడ్డీకి అంటాడు. ఏసేసినా బాగుణ్ణు, యీ కొరగాని కొలువైనా తప్పిపోను..." నవ్వుతూనే తన స్థితిని వివరించేడు.

సానుభూతితో చూసేను బుధడివేపు. ఏదయినా వొక ధైర్య వచనమో, ఓదార్పు పలుకో చెప్పాలన్పించింది, గానీ... యేదీ? గొంతులో శూన్యం..!

ఇంతలో – యెవరో కస్టమర్ వొచ్చేరు. బుధడు నమస్కరిస్తూ ఆయనను ఆహ్వానించేడు. ఆయన నవ్వుతూ వొచ్చి, టెలిఫోన్ అందుకొని డయల్‌చేసి – యెవరితోనో మాట్లాడసాగేడు!

అప్పుడు బుధడు -

"...ఉదయం బస్సులో మీకు చెప్పాను గదా, రోడ్డు వర్క్సు కంపెనీ మేనేజర్‌గారని- వీరే! మీ గురించి, అడిగేస్తాను వుండండి..." అన్నాడు నాతో! ఎందుకో అసందర్భంలా అన్పించింది. బుధడి సమస్యలు బుధడి కున్నాయి. అతడు నా గురించీ, నా సమస్య గురించీ ఆలోచించటం, సహకరించటం బహుశా, ఒక యువకుడు, యీ యాభై అయిదేళ్లవాడికి సహకరించడం నామోషీగా, అసందర్భంగా అన్పిస్తోందేమో!

ఆయన ఫోన్ పెట్టేసి, బిల్ చెల్లిస్తున్నాడు. బుధడు, ఆయనకు నన్ను పరిచయం చేసాడు. నమస్కరించేను.

"....మంచోరు సార్. పెద్దాయనా - ఇద్దరు డిగ్రీ చదివే పిల్లలూ, వీఆరెస్‌తో వూడిన ఉద్యోగం! ఎక్కవుంట్సు చక్కగా రాస్తారు...." లాంటి విశేషణాలతో ఆయన్ని వొప్పించేడు బుధడు. దాంతోపాటు, కథారచయిత అని మాత్రం చెప్పలేదు, రక్షించేడు.

మర్నాటి నుంచే - ఆఫీస్‌కి వొచ్చేయమన్నారు. కృతజ్ఞతగా చేతులు జోడించేను. అయితే నాలుగైదు నెలలకి మించి వుండని నౌకరీ అన్నాడు. తర్వాత సంగతి తర్వాత చూడొచ్చండీ - బుధడే జవాబిచ్చేడు.

❊ ❊ ❊

నేనే నౌకరీలో చేరేక - బుధడిని కలిసే సందర్భాలు తక్కువయినాయి. ఇంటి కెదురుగా వొక్కో ఉదయపు వేళనో, సాయంత్రపు వేళనో బుధడి నాయినమ్మ కబుర్లూ, బుధడి హాస్య సంభాషణా - యిపుడు అరుదయ్యింది.

అపుడపుడూ - ఆ ముసల్దే పలకరించేది. కూచోమనేది. మా పిల్లల చదువులు పూర్తి గావటాలూ, వాళ్ళేవో నౌకరీల సాధనా - యిక అప్పుడీ ఊరి నిండి - నేను పుట్టిన వూరుకి వెళ్ళిపోవటానికి సంబంధించీ, మా వాళ్లెవరో చేసిన సంభాషణల్లోంచి అర్థం చేసుకొని.......

"...బాబు... బతుకొక సంద్రం! ఇదిగీ నగరంవూ వొక సంద్రం! ఈదులాడాల నాయినా! నీనూ, నా పెనిమిటి, నా బిడ్డలూ, నా మనుమడూ... ఈదులాడినాం!

తొలీత, నీను కాళ్లపారాణి తోటి యీ వూరొచ్చినపుడు - మా అత్తోరిల్లు దండుబజార్ల వుండేది. ఇటు ధర్మాసుపత్రీ, అటు కలత్రాపీసూ ఆ పక్కన సంద్రం - కూలీలూ, కలాసోల్లూ, రిక్సావోళ్లూ, సుట్టూ పేదారోదా సంసారాలూ! కస్టమో - సుఖమో అంతా కలిసి పంచుకునీవోళ్ళిమి. ఎలాగ, మరి యీ పట్నం - ఎదుగుతుండీదోగాని వొకటొకటిగా మా పేటల పెద్ద పెద్ద బిల్డింగులొచ్చేవి. మాకు తెలీకుండానే - మా సుట్టూరున్న సంసారాల్లోనివి వొకొక్కటి అక్కడి నించి తరలిపోయీవి.

మా మామ కళ్లుమూసిన వొకయేడాదికి – మా సంసారఁవూ తరలిపోయింది, సీతంపేట కాడ కొత్తగా వాడ లెగిసింది. అక్కడ చేరినాం. నా పెనిమిటి బస్టాండ్‌కాడ కళాసీ! ఎన్ని మూటలు మోసేవోడో – అన్ని గళాసులు సారా తాగేసేవోడు! సాయింత్రింకి ఆడ్ని మోసుకొచ్చేవారు, యెవుళోవొకళ్ళు!

నాకు ముగ్గురాడపిల్లలూ, వొక కొడుకూ సంతానం. ఇద్దరాడ పిల్లలకి కన్నీరి కాసి పల్లెటూరి సంబంధాలే చేసాను. మూడోదానికి – యిక్కడే 'అల్లిపురం' సంబంధం చేసాను. అందరి బతుకులలగే వున్నాయి. 'అరక' కాయలేవు. 'లేవ' తోటి ఆగలేవని – బండెడ్లు గురిండంటార్లే – అలాగున్నాయి, ఆళ్ల బతుకులు! కొడుకుండీవోడంటే, యిదిగీ పట్నం రాకాసి మింగేసింది. పెద్ద అపార్టుమెంటు బాబు – అంతస్తంతస్తంతస్తు... యెక్కి పనిచెయ్యాలా? అక్కడ మరి యేటయ్యిందో పడిపోనాడు బాబూ! అయిపోయింది. ఆ తర్వాత, కోడలు కస్టం, సుకం కాసుకునీది అది యెళిపోయింది. ఈ సాగరంల యీదులాడుమని, యీ ముసిలి దానికి మనవళ్లని అప్పజెప్పి అందరెల్లి పోనారు! ఈదులాడేను! బాబూ... గాని, మరి ఈదలేను ఎలాగూ, మనవడు చేతికందుకొచ్చాడు. అదిగో, చిన్నమనవరాలి పెళ్ళి అయిపోతే చాల్ను....! కన్ను మూసేస్తాను. అంతే..! అంతవరకే చూస్తన్నాను..." అని, దుఃఖపు స్వరంతో ముగించేది తన సొదను.

గానీ, అపుడే వొచ్చిన బుధడు –

"....ఆఁ! అంతా దీని చేతిలోనే వుండే వ్యవహారమా? కన్ను ముయ్యడం, తెరవడం...? చెప్పండి సార్.. యిదేమన్నా – కావాలన్నపుడు రద్దు చెయ్యడానికి అసెంబ్లీయా?" అని, హాస్యమాడేవాడు.

గానీ, ఆ ముసల్ది–మనవరాలి పెళ్ళి చెయ్యటమూ, కన్ను మూయటమూ, జరుగాల్సిన చారిత్రక ఘటనలన్నంత సీరియస్‌గా మాట్లాడేది! దాంతో –

"అయితే, రేపే నా చెల్లెలికి పెళ్లి కుదిర్చేస్తాను. నువ్వు, పెళ్లయిన మర్నాడే కళ్లు మూసీయాల... అలాగేనా?" అని రెట్టించేవాడు బుధడు.

"...ఇల్లు గడపడానికిన్ని పత్రాకులు పడ్తున్నాడు. పెళ్లెలాగ జేస్తాడండి? కట్న కానుకలెలాగెడ్తాడండి? రాకా, పోకాలు, బందు బలగాలకి విందులెలగెడతాడండి? చెప్పమనండి?" అని, వరుస ప్రశ్నలు విసిరేది ముసల్ది, నన్ను మద్యవర్తిని జేసి.

"...యిదిగో, యీ ఇల్లు అమ్మేస్తాను. ఇపుడిక్కడ ధర బాగా పలికేది – మట్టికే, మనిషికిగాదు. ఇల్లు అమ్మేసి, కట్న కానుకలిచ్చి, పెళ్లి జేసిస్తే, అత్తోరింటికి చెల్లి యెళిపోద్ది. దాని పెళ్లయిపోతే యెలాగూ నువ్వు కన్ను మూస్సి కాటికెళిపోతానన్నావు! ఇంకేం...? నేనొక్కడ్నే! ఏక్ నిరంజన్! హోటల్ మే ఖానా – మఠం మే సోనా, కాదూ, యెలాగూ చిన్ననాటి నిండీ వున్న కోర్కె – దేశాటన చేయడం" అని వివరించేవాడు బుధడు.

బుధడు మాటల్తో ఆ ముసల్ది గాయపడ్డ పక్షిలా, నులక మంచమ్మీద ముడుచుకు పోయి శోకించేది.

ఆ దుఃఖవాతావరణంలో, ఆ ముసలిదాన్ని వొదిలేసి – వెళ్ళలేక, అక్కడే గింజులాడు కుంటుంటే– "...యిక్కడే 'కళాజాతర' అవుతోంది. చాలా మంది జనం వొచ్చేరు. వెళ్దాం, వొస్తారా..." అని బుధడే, అక్కడ్నించి నన్ను తీసుకెళ్లాడు.

అక్కడికి నడక దూరంలో – 'కళాజాతర' ! విశాలమైన మైదానం! ముఖద్వారం యేదో వృక్షపు కాండంతో, ఆకర్షణీయంగా చేసారు. అక్కడే, కుడివేపు గ్రామీణ యాదవకులానికి చెందిన 'తప్పెటగుళ్లు' కళాకారుల ప్రదర్శన మట్టితో చేసిన కళారూపాన్ని పెట్టేరు. అక్కడక్కడా పశువుల మందలూ, పచ్చని చేలగట్లూ, తామరపూల కోనేర్లూ, పూరిళ్ల ముంగిళ్లూ, ముగ్గులూ, గ్రామీణ స్త్రీలూ, అలంకరణలూ– యేవేవయితే, వొక గ్రామీణ జీవనానికి సంబంధించిన విశేషణాలో, అవేవయితే విధ్వంసమైనాయో, అవన్నీ, ఆ జాతరలో ప్రదర్శనా రూపాలుగా వున్నాయి! మహాపట్నం నిండి చాలా ఉత్సుకతతో, అపురూపంగా, అన్నీ చూస్తున్నారు, చాలామంది!

నాకెందుకో – యేదీ ఆకర్షించలేదు. సజీవమైన దానిని కోల్పోయి, నిర్జీవ ప్రతిరూపాల్ని చూస్తున్నట్లన్పించింది. నిరాసక్తంగా, నడుస్తుంటే –

"...నేను పుట్టిన్నాటికింకా ముప్పయి, ముప్పయ్యయిదేళ్ళ కిందట పుట్టాల్సింది! ఇది, మాకు కాలం గాదు సార్..." అన్నాడు బుధడు.

ఆశ్చర్యంగా చూసేను. వొక వికాశవంతమైన, యవ్వన తేజంతో కన్పించే బుధడు దిగులుగా, వెలుగు రహితంగా కన్పించేడు.

"ఔన్సార్, అప్పుడైతే – బతుక్కి యింత కాంపిటేషన్ లేదు..." అని దాదాపుగా నిర్ధారణగా మాట్లాడేడు... బుధడు!

నేను ఆలోచనల్లో పడ్డాను. ముప్పయి, ముప్పయ్యయిదేళ్ల ముందర? అంటే యించుమించుగా నా యవ్వన ప్రాయం! నా జీవితం... యింత కాంపిటీషన్ లేనిదా?

స్వాతంత్ర్యపాలనా, ప్రణాళికలూ, అభివృద్ధిపథకాలూ, కార్యాలయాలూ, పాఠశాలలూ పల్లెలూ, పట్నాలూ, వికశించటాలూ – వీటికి బదులుగా – పెరిగే ధరలూ, తరిగే ఉపాధి అవకాశాలూ, పూర్తిగాని ఆనకట్టలూ, అమలుగాని భూసంస్కరణలూ, జై ఆంధ్రా, విశాఖ ఉక్కు, భూమీ, భుక్తీ, విముక్తికై పోరాటాలూ... గుర్తొచ్చేయి!

"...మీకపుడు – స్టీల్ ఫ్యాక్టరీ, పోర్టు, షిప్‌యార్డు, యేదో యెరువుల ఫేక్టరీ వుండేవి! ఇపుడు మాకేవీ...? అన్నీ మూతలు! ఉన్నవాటికా, కాంపిటీషన్! విపరీతమైన డబ్బూ, విపరీతమైన ఎడ్యుకేషనూ, హైటెక్నాలజీ వుంటేగానీ పోటీ పడలేం సార్! అవి,

మాకెక్కడివీ; అని ప్రశ్నించి, అక్కడి పచ్చిక మీద చతికిలబడ్డాడు. నేను గూడా కూర్చున్నాను. ఒకతరం నిండి మరో తరానికి అందాల్సిన సామాజిక సంపద గురించి కదా, బుధడు, మాట్లాడినది అనన్పించింది.

"...సొమ్ము (డబ్బుతో) కుదబలిసిన వాడు నా ఎస్టీడీబూత్‌కీ పోటీ. అక్కడ... ఔట్ మనం! ఇక, కంపెనీయా...! సార్, మా వాడేవో హైటెక్నాలజీ యంత్రాలు తెస్తాడట! వాటి మీద మేము పనిచెయ్యలేమట. త్వరలో కంపెనీ మనకి చీటి చింపేస్తాది..." బ్రతుకుపోరులో – తన బలహీనతలను చెప్పేడని కాదు నేనాలోచించేది, వొక యువకుడు తనకిది బ్రతుక్కి కాలం గాదంటున్న దాన్ని ఆలోచిస్తున్నాను...........

"...వొక యువకుడు, యిది మాక్కాలం గాదు సార్, అనంటే ఆ దేశానికి భవిష్యత్ లేనట్టుగా గదా బుధా?" అని ప్రశ్నించేను.

బుధడు – బదులివ్వలేదు. పచ్చికలో వేళ్ళతో గీతలు గీయసాగేడు. మౌనంగా కూర్చున్నాం! ఎవరి ఆలోచనల్లో వాళ్లం...!

"రాయండి సార్...! నా గురించి కథ రాయండి..." అప్పుడే, బ్రతిమాల్తున్నట్టుగా, పలికేడు.

అంతలో, అక్కడికి మా మేనేజర్ గారొచ్చేరు. బుధుడు ఆయనకి నమస్కరించేడు. ఆయన –

"...మీరు రేపు బయల్దేరి, రాజస్థాన్‌లో మన హెడ్డాపీస్‌కి వెళ్లాలి. బహుశా పదిహేను, యిరవై రోజులుండాలేమో! అర్జంట్ అకౌంట్స్ క్లియరెన్స్ వర్కు వుందిట. మీ పేరిచ్చేను..." నాతో చెప్పాడాయన!

అదిగో, అక్కడ, ఆవిధంగా తెగిన ఆ సంభాషణ – మళ్లీ అతుక్కోలేదు. కంటిన్యూ కాలేదు. కళాజాతర నించి బయటి కొచ్చేం..!

దాదాపుగా నెలరోజులు పైగా వుండాల్సొచ్చింది రాజస్థాన్‌లో! మధ్యలో రెండు సార్లు ఫోన్ చేస్తే, వోసారి బుధడూ, మరోసారి బుధని చెల్లెలూ మాట్లాడేరు. తర్వాత, వారం రోజులుగా ఫోన్ తగల్లేదు. ఆందోళన...! ఏ విషయాలూ తెలీవు!

రాజస్థాన్ నిండి తిరిగొచ్చేను. ఇంట్లో సూట్‌కేస్ పడేసి యెదురుగా చూద్దును గదా, పురిపాక లేదు! ఖాళీ స్థలం, కూలిన గోడలు – చుట్టూ రాతితో వేసిన ప్రహరీ కన్పించింది కొత్తగా!

"...బుధడి చెల్లిలికి పెళ్లి సంబంధం కుదరటం, యీ ఇల్లు అమ్మేయటం, పెళ్లి చెసెయ్యటం, యెటువాళ్లు అటు వెళ్లిపోవటం జరిగి వారం రోజులయ్యింది...." మా ఆవిడ వార్తలు చెప్పినంత సాధారణంగా చెప్పింది.

నాలో – రక్తం పాదాల నిండీ శిరస్సు దాకా – వొక్కసారి కళాపెళామని పొర్లింది.

యెటువాళ్లు అటు వెళ్ళిపోవటం అంటే? కొంపదీసి, సాయంత్రపు వేళల్లో, ఆ దుఃఖపు గొంతుతో, ఆ ముసల్ది అన్నట్లు – ఆ బుధడు అన్నట్టూ... గానీ...? ప్రశ్నార్థకంగా చూస్తే. మా ఆవిడ –

"ముసిల్ది పోయిందట. మూడో రోజట..." చెప్పింది!

అంటే, అలాగే జరిగేయా? అయ్యో... అని, వాపోతూ, జంక్షన్‌కి నడిచి, ఎస్టీడీ బూత్ కోసం వెదికాను. రోడ్ల విస్తరణలో దాన్ని కూల్చేసి, రోడ్డు పడింది. విస్తరణకు అందకుండా, అక్కడి కాంప్లెక్స్ మాత్రం విజేతలా నిల్చుంది...!

బుధడి కోసం వెదికేను – ఎందర్నో అడిగేను...ఏడీ?

ఎక్కడా...? బుధడేడి....?

బుధడొక విషాదాక్షరం! ★

*ప్రజాసాహితి – డిసెంబర్, 2003*